కార్మికుల బతుకు భద్రమేనా?

- రసాయనిక పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు
- సమిధలవుతున్న కార్మికులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ప్రమాదం అనంతరం తూతూ మంత్రంగా చర్యలు
- తాజాగా ఎస్‌బీ ఆర్గానిక్స్ ఘటనలో ఆరుగురు మృతి
- కాలంచెల్లిన రియాక్టర్ వాడకంతోనే ప్రమాదం

పేలుడు ధాటికి దెబ్బతిన్న హత్నూర చందాపూర్‌లోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ

సంగారెడ్డి, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ): రసాయనిక పరిశ్రమల్లో భద్రత డొల్లగా మారింది. ఇందుకు ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలోని ప్రమాద ఘటన నిదర్శనం. హత్నూర మండలం చందాపూర్‌లోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమ(యూనిట్-1)లో బల్క్‌డ్రగ్స్ ఉత్పత్తి జరుగుతుంది. 150 మం దికిపైగా కార్మికులు పనిచేసే ఈ పరిశ్రమలో యాజమాన్యం సరైన భద్రతా చర్యలు చేపట్టకుండానే బల్క్‌డ్రగ్స్ ఉత్పత్తి చేస్తుందన్న ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తూ గత బుధవారం కం పెనీలో రియాక్టర్ పేలి ఆరుగురు మృతిచెందారు. ఈ ఘటనతో హత్నూర మండలం ఉలిక్కిపడింది. రియాక్టర్ పేలుడు శబ్దానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

కాలం చెల్లిన యంత్రాల వాడకం!

ప్రాథమిక సమాచారం ప్రకారం కంపెనీలో 6కేఎల్ సామర్థ్యం ఉన్న రియాక్టర్ పేలిపోయింది. సాంకేతిక సమస్యలు తలెత్తడం, రియాక్టర్ కాలంచెల్లింది కావడంతో ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో రియాక్టర్ సమీపంలో ఉన్న ఎండీ రవిశర్మతోపాటు మరో ఐదుగురు కార్మికులు మృతిచెందారు. 20 మందికిగాపై తీవ్రంగా గాయపడ్డారు. ఇంటికి బయలుదేరిన ఎండీ రవిశర్మ రియాక్టర్‌లో సమస్య ఉందని తెలియడంతో ఇస్మాయిల్‌ఖాన్‌పేట నుంచి తిరుగుపయనమై కంపెనీకి చేరుకున్నారు. ఆయన చేరుకున్న కొద్దిసేపటికే ప్రమాదం జరిగి ఆయన మృతిచెందారు. మృతుల్లో నలుగురు రియాక్టర్ వద్ద విధులు లేనప్పటికీ సాంకేతిక సమస్యను పరిష్కరించేందుకు అక్కడికి వచ్చి మృత్యువాత పడినట్లు తెలుస్తోంది. కాలం చెల్లిన రియాక్టర్ ఉపయోగించడం, సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తుంది. కంపెనీ యజమాని ఇంతవరకు ప్రమాద స్థలానికి రాకపోవటం, క్షతగాత్రులను పరామర్శించకపోవడాన్ని కార్మికులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. ప్రమాద ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయినా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని... మృతుల కుటుంబీకులు, క్షతగాత్రులైన కార్మికుల కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.

కానరాని భద్రతా చర్యలు

పటాన్‌చెరు, పాశమైలారం, హత్నూర, సంగారెడ్డి, జిన్నారం, గుమ్మడిదల ప్రాంతాల్లో రసాయనిక పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. సరైన భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జిల్లాలోనే ఇటీవల జరిగిన ప్రమాదాల్లో తొమ్మిది మంది కార్మికులు మృతిచెందారు. జిల్లాలోని కోవలెంట్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో నలుగురు కార్మికులు మృతిచెందారు. సీఎంఎస్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. 18 మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. మైలాన్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. తాజాగా ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. రసాయనిక పరిశ్రమల్లోని రియాక్టర్లను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సి ఉంటుంది. కాలంచెల్లిన రియాక్టర్లు కంపెనీలు వాడకుండా చర్యలు చేపట్టాలి. రియాక్టర్ల వద్ద నిపుణులు పనిచేయాల్సి ఉంటుంది. కంపెనీ యాజమాన్యాలు నిపుణులకు ఎక్కువ వేతనాలు చెల్లించాల్సి వస్తుందని నైపుణ్యం లేని వారితో రియాక్టర్ల వద్ద పనులు చేయిస్తోంది. దీంతో రియాక్టర్ల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పరిశ్రమల్లో ప్రమాదం జరుగకుండా అవసరమైన అన్‌సైట్ భద్రతా చర్యలు, ఫైర్‌సేఫ్టీ మేజర్స్ తీసుకోకపోవడంతో ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ప్రమాదాలు జరిగిన వెంటనే స్పందించి ప్రాణనష్టం జరుగకుండా చూసే బాధ్యత అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులపై ఉంది. అగ్నిమాపక కేంద్రాల సంఖ్య, వాహనాల సంఖ్య తక్కువ ఉండడం శాపంగా మారుతున్నది.



ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో పేలిన రియాక్టర్(ఫైల్)

కంపెనీల్లో కానరాని తనిఖీలు!

రసాయనిక పరిశ్రమల్లో భద్ర తా విభాగంతోపాటు ఫైర్, ఇతర శాఖల అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. జిల్లాలోని పరిశ్రమ లు, రసాయనిక పరిశ్రమల్లో తనిఖీలు జరగడం లేదని సమాచారం. పరిశ్రమల భద్రత శాఖ అధికారులు అవినీతికి పాల్పడుతూ కంపెనీల్లో తూతూమంత్రంగా తనిఖీలు చేపడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పరిశ్రమల భద్రతా విభాగం అధికారి అవినీతికి పాల్పడడంతో గతేడాది సస్పెన్షన్‌కు గురయ్యారు. మరో అధికారి ఏండ్లుగా జిల్లాలో నే తిష్ట వేసి అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. రసాయనిక పరిశ్రమల్లో వ రుసగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్న తరుణంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రసాయనిక పరిశ్రమల్లో కమ్రం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని, ప్రమాదాలు జరుగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

బీఆర్ఎస్ విజయానికి కృషి చేస్తాం

హరీశ్‌రావుతో సీఏసీఎస్ డైరెక్టర్ నర్మద

కోహీర్, ఏప్రిల్ 7: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ విజయానికి కృషి చేస్తామని మాచిరెడ్డిపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ నర్మదాదేశ్‌పాండే అన్నారు. ఆదివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసి పలు అంశాలపై చర్చించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌కు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, రాజ్‌కుమార్ దేశ్‌పాండే, ఆదిత్య కులకర్ణి ఉన్నారు.

దర్గాలో మంత్రి ప్రార్థనలు

ప్రార్థనలు చేస్తున్న మంత్రి దామోదర

మునిపల్లి, ఏప్రిల్ 7: మండల పరిధిలోని తాటిపల్లి శివారులోని పెద్దగుట్ట షాదుల్లా దర్గాలో ఆదివారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదార రాజనర్సింహ ప్రత్యేక ప్రార్థనాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రిని స్థానికులు పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు.

పుట్టి భాస్కర్‌కు అవార్డు

అవార్డు అందుకుంటున్న పుట్టి భాస్కర్

జిన్నారం, ఏప్రిల్ 7: జిన్నానికి చెందిన పుట్టి భాస్కర్‌కు ఇండియన్ హానరబుల్ 2024 అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ భవనంలో మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యం లో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. వివిధ రంగాల్లో చేస్తున్న సేవలకు గాను పుట్టి భాస్కర్‌కు ఈ అవార్డు లభించింది. పుట్టి భాస్కర్ మాట్లాడుతూ అవార్డు అందజేసిన మయూరి రాధాదత్తుసింగ్, బింగి నరేందర్‌గౌడ్, ఏర్పుల శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్తిపన్నుపై రాయితీ

సదాశివపేట, ఏప్రిల్ 7: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెల 30లోగా ఆస్తిపన్ను చెల్లించిన వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీ కల్పించిందని మున్సిపల్ కమిషనర్ ఉమ తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆస్తిపన్ను చెల్లించాలన్నారు. సకాలంలో ఇంటిపన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

కల్హేర్, ఏప్రిల్ 7: రంజాన్‌ను పురస్కరించుకొని కల్హేర్, కృష్ణాపూర్ గ్రామాల్లో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కొన్యాలలో బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, ఏప్రిల్ 7: ఇటీవల పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో మృత్యువాతపడ్డ బాధిత కుటుంబాలను ఆదివారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పరామర్శించి ఓదార్చారు. హత్నూర మండలం చందాపూర్ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ కెమికల్ పరిశ్రమలో పేలుడు ఘటనలో హత్నూర మండలం కొన్యాల గ్రామానికి చెందిన వడ్డెపల్లి రమేశ్, చందాపూర్ గ్రామానికి చెందిన చాకలి విష్ణు మృతి చెందడంతో వారి కుటుంబాలను ఎమ్మె ల్యే పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లేబర్ వెల్ఫేర్‌బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, ఎంపీపీ నర్సింహులు, దామోదర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్, శ్రీకాంతరెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు.

కేసీఆర్ సెక్యులర్ నేత

మాజీ హోం మంత్రి మహమూద్ అలీ

ఇఫ్తార్ విందులో మాజీ హోం మంత్రి మహమూద్ అలీ, మాణిక్‌రావు, గాలి అనిల్‌కుమార్

కోహీర్, ఏప్రిల్ 7: తెలంగాణలో కేసీఆర్ మాత్రమే ఏకైక సెక్యులర్ నేత అని మాజీ హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలోని ఎన్ కన్వెన్షన్ హాలులో దివంగత ఫరీదుద్దీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, తదితరులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ మాట్లాడుతూ కేసీఆర్ 1986లోనే ఇఫ్తార్ విందు ఇవ్వడం ప్రారంభించారని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో ఎక్కడా అల్లర్లు జరుగలేదన్నారు. గంగా, జమునా, తెహజీబ్ లాగా కలిసి మెలిసి ఉన్నారన్నారు. ఈ సందర్భంగా తన్వీర్‌కు ఫలహారాలు తినిపించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పలు కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దేవీప్రసాద్, నరోత్తం, భిక్షపతి, నాయకులు జైపాల్‌రెడ్డి, పైతర సాయికుమార్ పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

కల్హేర్, ఏప్రిల్ 7: మాసాన్‌పల్లి ఎక్స్ రోడ్డు సమీపంలోని వెంకటాద్రి ఫంక్షన్ హాల్‌లో సోమవారం 11గంటలకు కల్హేర్, పెద్ద శంకరంపేట్ మండలాల జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికల బీఆర్ఎస్ సన్నాహక సమావేశాన్ని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జడ్పీటీసీ నర్సింహారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు రాంసింగ్ తెలిపారు. ఈ సమావేశానికి జహీరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, అభిమానులు అధిక సంఖ్య లో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సదాశివపేటలో..

సదాశివపేట, ఏప్రిల్ 7: బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ద గొల్ల అంజనేయులు తెలిపారు. ఉదయం 10 గంటలకు పట్టణంలోని దుర్గా ఫంక్షన్ హాలులో మెదక్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హాజరవుతారని, పట్టణం, మండలానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

కల్హేర్, ఏప్రిల్ 7: రైతులు యాసంగిలో పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని కల్హేర్ పీఏసీఎస్ సీఈవో భాస్కర్ రైతులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కల్హేర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకూడదని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి సహకరించాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

జిన్నారం, ఏప్రిల్ 7: మండల కేంద్రం జిన్నారంలో బీజేపీ నాయకులు ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు చెందిన సింధుభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు, పార్టీ మండలాధ్యక్షుడు జగన్‌రెడ్డి ప్రారంభించారు. ఎండలు మండుతున్న నేపథ్యంలో వివిధ అవసరాల నిమిత్తం జిన్నారానికి వచ్చే వారికి, ప్రయాణికులకు తాగునీటిని అందించేందుకే ఫౌండేషన్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. వాటర్ బాటిళ్లు కొనకుండా చలివేంద్రంలో నీటిని తాగాలన్నారు.

ఎమ్మెల్యేకు జాతర ఆహ్వానం

ఎమ్మెల్యే మాణిక్‌రావును ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కోహీర్, ఏప్రిల్ 7: మొగుడంపల్లి మండలంలోని మన్నాపూర్ గ్రామంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించే బీరప్ప జాతరకు హాజరుకావాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావును కోరారు. ఆదివారం మన్నాపూర్ బీరప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాణిక్‌రావుతో పాటు మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, వెంకటేశానికి వారు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఉత్సవాలకు హాజరుకావాలని విన్నవించారు. కార్యక్రమంలో పూలేందర్, నవీన్, దశరథ్, వెంకట్, నారాయణ, సుభా శ్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతోనే దేశాభివృద్ధి



కోహీర్: ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరిన పలు పార్టీల నాయకులు

న్యాల్‌కల్, ఏప్రిల్ 7: కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, ఎంపీ బీబీపాటిల్ అన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మండలానికి చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు చేరారు. మండలంలోని రత్నాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ రవికుమార్, న్యాల్‌కల్‌కు చెందిన దళిత నాయకుడు సంజీవయ్యతో పాటు పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలకు ఆయన బీజేపీ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీతో నే దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఓంకార్‌యాదవ్, నాయకులు పాండురంగారెడ్డి, బస్వరాజ్‌పాటిల్, ఏక్‌నాథ్‌రావు, పాటిల్, శరణయ్యస్వామి, మల్లేశం, మల్లప్ప, సిధారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సతీశ్‌గుప్తా, రహుల్ పాల్గొన్నారు.

ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో చేరికలు

కోహీర్, ఏప్రిల్ 7: జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో ఆదివారం పలు పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మహీంద్ర కాలనీలో చేపట్టిన నగర సంకీర్తనలో పాల్గొన్నారు. అనంతరం జహీరాబాద్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి బీజేపీని ఆశీర్వదించండి

రాయికోడ్, ఏప్రిల్ 7: దేశం కోసం, ధర్మం కోసం మోదీకి ఓటు వేయాలని జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలు మరోసారి బీజేపీని ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు ఎ.శ్రీనివాస్ పాటిల్, నాగారాజు, సతీశ్ కుమార్ పాటిల్, సందిప్‌గౌడ్, తుకారం, నర్సింహులు, గణేశ్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాట శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మాదారం గ్రామస్తులు

జిన్నారం, ఏప్రిల్ 7: మాదారం గ్రామానికి చెందిన పలువురు యువకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు రాజుగౌడ్ ఆధ్వర్యంలో సుదర్శన్, సంతోష్, వినయ్, చింటూ, నవీన్, బాలరాజు, బాబురావు, సందీప్, విట్టల్, అరుణ్, శివ తదితరులు నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పై యువకుల్లో రోజురోజుకూ నమ్మకం పెరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు సీతారామ్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్, లక్ష్మణ్‌సింగ్, వెంకటయ్య, వెంకటేశ్ గౌడ్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

అమీన్‌పూర్ ఏప్రిల్ 7: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని కాంగ్రెస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం అంబికా కాలనీలో కాంగ్రెస్ మున్సిపల్ జనరల్ సెక్రటరీ రమేశ్ ఆధ్వంలో క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు.

32 కేజీల గంజాయి పట్టివేత

పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

రామచంద్రాపురం, ఏప్రిల్ 7: తెల్లాపూర్ మున్సిపాలిటీ కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగల్‌గిద్ద మండలం ఎరక్‌పల్లికి చెందిన బి.లక్ష్మణ్ జీవనోపాధి కోసం వచ్చి మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో నివాసం ఉంటున్నాడు. అతడికి డబ్బులు అవసరం ఉండి ఎరక్‌పల్లికి చెందిన జైపాల్‌కు ఫోన్ అడిగాడు. దానికి అతను నేను చెప్పింది చేస్తే డబ్బులు ఇస్తానని చెప్పడంతో లక్ష్మణ్ దానికి ఒప్పుకొని అతను చెప్పినట్లు గంజాయిని సరఫరా చేసేందుకు తెల్లాపూర్ శివారులోని శిల్ప వెంచర్ చెట్ల పొదల్లో దాక్కున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి వెళ్లి లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఉన్న 32 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

ఇఫ్తార్ విందులో ఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 7: హిందూ, ముస్లింల ఐక్యతను చాటిచెప్పేది రంజాన్ అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి అన్నారు. ఆదివారం భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజీ కమ్యూనిటీ హాల్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసిన తర్వాత ఇఫ్తార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, గఫార్, అజీముద్దీన్, కుత్బుద్దీన్, గౌజ్, రఫిక్, పరమేశ్, ప్రమోద్ గౌడ్, వినయ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, సుధాకర్, సత్యనారాయణ, ఐలేశ్, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా 'మోడల్' పరీక్ష

ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రం ఎదుట వేచిఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బొల్లారం, ఏప్రిల్ 7: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో 6, 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీల భర్తీకి ఆదివారం జరిగిన ప్రవేశ పరీక్ష సజావుగా ముగిసింది. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు ఆరో తరగతి విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాశారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులు పరీక్ష రాశారు. ఆరో తరగతిలో 100 సీట్ల కోసం ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో కలిపి రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆరో తరగతి పరీక్ష కోసం 240 మంది విద్యార్థులకు 221 మంది పరీక్ష రాయగా 19 మంది గైర్హాజరయ్యారు. 7వ తరగతిలో 89 మంది విద్యార్థులకు 79 మంది పరీక్ష రాయగా 10 మంది గైర్హాజరయ్యారు. 8వ తరగతిలో 65 మంది విద్యార్థులకు 58 మంది పరీక్ష రాయగా 7గురు గైర్హాజరయ్యారు. 9వ తరగతిలో 53 మంది విద్యార్థులకు 46 మంది పరీక్ష రాయగా 7గురు గైర్హాజరయ్యా రు. పదో తరగతిలో 10 మంది విద్యార్థులకు 8 మంది పరీక్ష రాయగా ఇద్దరు గైర్హాజరయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రుల రాకతో పరీక్ష కేంద్రం వద్ద సందడి నెలకొంది.

బోర్డుపై హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలుకుతున్న వేదపండితులు

ముగిసిన వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు

గుమ్మడిదల, ఏప్రిల్ 7: భద్రకాళీసమేత వీరభద్రస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి, ఏకాంత సేవతో ముగింపు పలికారు. మండలంలోని వీరన్నగూడంలోని బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులపాటు వైభవంగా కొనసాగాయి. ఈవో శశిధర్‌గుప్తా, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు రవీంద్రమూర్తి, సోమయ్య, అర్చక బృందం, ఇరుగ్రామాల పెద్దల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. చివరి రోజు ఆదివారం పురోహితుడు కిరణ్‌కుమార్‌శర్మ వేద మంత్రోచ్ఛారణల మధ్య పూర్ణాహుతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఎండిన 'ఓదేను కుంట'

వర్గల్, ఏప్రిల్ 7: వర్గల్ మండలం దండుపల్లి, బొర్రెగూడెం గ్రామాల సరిహద్దులోని ఓదేను కుంట ఎండిపోయింది. బీఆర్ఎస్ పాలనలో మిషన్ కాకతీయ పనులతో కుంట కొత్తరూపుదిద్దుకోగా నేడు కరువ